# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- పూర్వ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు.

- సాంకేతికత, వాణిజ్యం, పెట్టుబడులపై భారత్ - అమెరికా దేశాలు ప్రత్యేక దృష్టి సారించాయని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు.

- మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు రేపు రాజ్‌ఘాట్ సమీపంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించనున్నారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

==============================

నిన్న రాత్రి దివంగతులైన పూర్వ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఢిల్లీలోని ఆయన నివాసంలో నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి సంతాప సందేశంలో ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తుంచుకుంటుందని అన్నారు. ఆర్‌బీఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో దేశానికి సేవలందించారని, భవిష్యత్తు తరాలకు ఆయన జీవితం ఒక స్ఫూర్తి అని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

కేంద్రమంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, జ్యోతిరాదిత్య సింధియా, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తదితర నేతలు ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో విప్లవాత్మకమైన చట్టాలకు రూపకల్పన చేసిన మన్మోహన్ సింగ్ దేశ చరిత్రలో అజరామరంగా నిలిచిపోతారన్నారు. ప్రధానమంత్రిగా ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని హోం మంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

==============================

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల కాంగ్రెస్ నేత సోనియాగాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివేకానికి, వినయానికి ప్రతిరూపమైన ఓ గొప్ప నాయకుడిని, మార్గనిర్దేశకుడిని పార్టీ కోల్పోయిందన్నారు. ఆయన దూరదృష్టితో దేశంలోని లక్షలాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. గొప్ప రాజనీతిజ్ఞుడిగా ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు పొందారని.. ఆయన లేని లోటు పార్టీకి, దేశానికి పూడ్చలేనిదని అన్నారు. మన్మోహన్‌సింగ్ మరణంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సంతాపం తెలియజేసింది. ఆయన ఆశయాలను, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తామని తీర్మానం చేసింది.

==============================

నిన్నరాత్రి ఢిల్లీలో మృతి చెందిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నివాళులర్పించింది. రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన గౌరవ సూచకంగా 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. ఈ సమయంలో భారతదేశం అంతటా జాతీయ జెండా సగం స్తంభానికి ఎగురవేయబడుతుంది. అలాగే విదేశాల్లోని అన్ని భారతీయ మిషన్లు, హైకమీషన్లలో అంత్యక్రియల రోజున జాతీయ జెండా సగం స్తంభానికి ఎగురవేయబడుతుంది. కాగా ప్రజల సందర్శనార్థం రేపు ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. అనంతరం రాజ్‌ఘాట్ సమీపంలో ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మన్మోహన్‌సింగ్ 10 సంవత్సరాల పాటు దేశానికి ప్రధానమంత్రిగా సేవలందించారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. దివంగత ప్రధానమంత్రి పీ.వీ. నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు.

==============================

సాంకేతికత, వాణిజ్యం,  పెట్టుబడులపై భారత్ - అమెరికా దేశాలు ప్రత్యేక దృష్టి సారించాయని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు. ఈరోజు వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయ బృందం న్యూయార్క్, చికాగో, శాన్ ఫ్రాన్సిస్కో, సీటెల్, హ్యూస్టన్, అట్లాంటాలోని కాన్సుల్స్ జనరల్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులపై  భారత్-అమెరికా దేశాలు తమ భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు  ఉన్న అవకాశాలపై చర్చించామని తెలిపారు. అలాగే  అమెరికాలో ఉన్న భారతీయ సమాజానికి మెరుగైన సేవలందించడంపై తన అభిప్రాయాలను పంచుకున్నానని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

విరామం

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

==============================

మాజీ ప్రధానమంత్రి, మన్మోహన్ సింగ్ మృతి పట్ల ప్రపంచ దేశాల నేతలు తమ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతిపై అమెరికా విదేశాంగ శాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ స్పందిస్తూ.... ప్రపంచంలోని గొప్ప నాయకుల్లో మన్మోహన్ సింగ్ ఒకరని, గత రెండు దశాబ్దాల్లో ఇరు దేశాలు సాధించిన ప్రగతికి ఆయన పునాది వేశారని పేర్కొన్నారు.  భారత్ వేగంగా అభివృద్ధి చెందడానికి ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు ప్రజలకు ఎల్లవేళలా గుర్తుండిపోతాయని అన్నారు. భారత మాజీ ప్రధానమంత్రి, మన్మోహన్ సింగ్ మరణవార్త తనసెంతో బాధించిందని- కెనడా దేశ మాజీ ప్రధానమంత్రి స్టీఫెన్ హార్పర్ పేర్కొన్నారు.  ఆయన  అసాధారణమైన తెలివితేటలు, చిత్తశుద్ధి, వివేకం కలిగిన వ్యక్తి అని ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులందరికీ తన సంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు. అఫ్ఘనిస్థాన్‌కు మన్మోహన్

సింగ్ మంచి మిత్రులని ఆ దేశ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్ అన్నారు. ఆయన ఆత్మకు శాశ్వత శాంతి లభిస్తుందని పేర్కొన్నారు. భారత్, రష్యా దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు డాక్టర్ మన్మోహన్ సింగ్ అందించిన సహకారం ఎనలేనిదని, ఆర్థికవేత్తగా అతని నైపుణ్యం, భారతదేశ పురోగతికి అతని నిబద్ధత, సున్నిత ప్రవర్తన కొనియాడదగినవని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ పేర్కొన్నారు.

==============================

సూర్యుడి అన్వేషణ నిమిత్తం ప్రయోగించిన "పార్కర్ సోలార్ ప్రోబ్" సౌర ఉపరితలానికి అతి దగ్గరగా సురక్షితంగానే ఉందని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా వెల్లడించింది. సూర్యుడి బాహ్య వాతావరణంగా పిలిచే కరోనా పరిశోధన నిమిత్తం నాసాతో పాటు పలు ఇతర పరిశోధన సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు సంయుక్తంగా దీనిని రూపొందించారు. నిన్న రాత్రి పార్కర్ సోలార్ ప్రోబ్ నుంచి సంకేతం వచ్చిందని.. మేరీలాండ్‌లోని జాన్ హాప్కిన్స్ అప్లైడ్ ఫిజిక్స్ లేబోరేటరీ వెల్లడించింది. ఈనెల 24వ తేదీ సౌర ఉపరితలానికి 6.1 మిలియన్ కిలోమీటర్ల దూరంలోకి వెళ్లి, సూర్యుడికి అత్యంత దగ్గరగా చేరినట్లు తెలిపారు. ఈ పార్కర్ సోలార్ ప్రోబ్ జనవరి 1న తన పరిశోధనలకు సంబంధించిన వివరణాత్మక టెలిమెట్రీ డేటాను పంపనుందని నాసా పేర్కొంది.

==============================

స్మార్ట్ సిటీస్ మిషన్ కింద 71 నగరాల్లో 2 వేల 398 ప్రభుత్వ పాఠశాలల్లో 9 వేల 433 స్మార్ట్ క్లాస్ రూమ్‌లను అభివృద్ధి చేశాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బెంగళూరు తన జాతీయ స్థాయి అధ్యయనంలో తెలిపింది. 2015-16 నుండి 2023-24 మధ్య 19 నగరాలు నివేదించిన డేటా ప్రకారం స్మార్ట్ సిటీస్ మిషన్ ద్వారా స్మార్ట్ క్లాస్ రూమ్‌లను ప్రవేశపెట్టడం వల్ల మొత్తం నమోదులో విద్య నాణ్యతలో 22 శాతం పెరుగుదల కనిపించిందని వెల్లడించింది. విద్యా రంగంలో అంతరాలను తగ్గించడానికి సాంకేతికతను ఉపయోగిస్తుందని పేర్కొంది. అలాగే నిఘా చర్యలు అమలులోకి రావడంతో మొత్తం నేరాల రేటు శాతం తగ్గిందని తెలిపింది. అదేవిధంగా పట్టణ మహిళల భద్రతలో సాంకేతిక పురోగతిని సాధించిందని తన నివేధికాలో పేర్కొంది.

==============================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 78 వేల 472 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 226 పాయింట్ల లాభంతో 78 వేల 699 వద్ద ముగిసింది. నిఫ్టీ 63.20 పాయింట్ల లాభంతో 23 వేల 813 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 25 పైసలు క్షీణించి 85.52కి చేరింది. అంతర్జాతీయ విపణిలో బ్యారెల్ చమురు 73.37 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2 వేల 639 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

==============================

వదోదరలో ఈరోజు వెస్టిండీస్‌తో జరిగిన మూడో వన్డే క్రికెట్ మ్యాచ్ లో భారత మహిళల జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీనితో  మూడు వన్డేల సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 162 పరుగులకే మొత్తం వికెట్లను కోల్పోయింది.  భారత్ 28.2 ఓవర్లలో ఆ లక్ష్యాన్ని  సునాయాసంగా ఛేదించింది.

మరోవైపు మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియా - భారత్ పురుషుల జట్ల మధ్య జరుగుతున్న  నాలుగో టెస్టు క్రికెట్ మ్యాచ్ లో రెండవ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 46 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 474 పరుగుల కు ఆలౌట్ అయ్యింది. భారత్  ఇంకా 310 పరుగుల వెనకంజలో ఉంది. ఫాలో ఆన్‌ను తప్పించుకోనేందుకు మరో 111 పరుగులు చేయాలసి ఉంది.

==============================

==============================